

'హరేరామ్, హరేరామ్.'

ప్రతి ఉదయం అలవాటుగా వినిపించే ఆ గొంతు విని బాల్కనీలోకి వచ్చాను. హరేరామ్ గేటు లోపలికి వచ్చి మెట్ల ముందు నుంచున్నాడు.

'హరేరామ్, హరేరామ్ పది పైసలు ధర్మం చెయ్యండి. బియ్యం ఇప్పించండి. మీ పేరు చెప్పుకుని తిండి తింటాను. మీకు పుణ్యం వస్తుంది.' అందరూ అతణ్ణి హరేరామ్ అనే అంటారు.

చాలా అణువుగా మాట్లాడతాడు. రోజుకొక కొత్త డైలాగు వినిపిస్తాడు. ఇంగ్లీషు పదాలు దొర్లిస్తుంటాడు. చిన్నప్పుడు ఎట్లాగ బతికాడో,

# హరేరామ్

— అరవింద

ఎక్కడ బతికాడో మరి! ఇప్పుడు ఇల్లిల్లూ తిరిగి తిరిపెమెత్తుకు బతుకుతున్నాడు.

నల్లగా ఉంటాడు. ఒళ్ళంతా ముడుతలు పడిపోయింది. వడిలి ఎండిపోయిన వరుగులా ఉంటాడు. జుట్టు తెల్లగా పీచులా ఉంటుంది.

కాషాయరంగు చొక్కా తొడుక్కుంటాడు. ఎవరో భజన సమాజం వాళ్ళు దానం చేశారుట. ఒక చేతిలో కర్ర రెండో చేతిలో తెల్ల గిన్నె, భుజానికి ఒక జోలి తగిలించుకుంటాడు.

క్రింద ఇంట్లో ఉండే రమ ఒక డబ్బాలో బియ్యం, పది పైసలు తెచ్చి ఇచ్చింది. అది రమ అలవాటు. రోజూ హరేరామ్ వస్తాడు. రమ విరిగా బియ్యం ఇస్తుంది.

'చల్లగా ఉండు తల్లీ, నీ పిల్లలు వృద్ధిలోకి వస్తారు. జన్మ జన్మలకీ నువ్వు సుఖంగా ఉండాలి.' జోలిలో బియ్యం పోయించుకుని అన్నాడు హరేరామ్. రమ లోపలికి వెళ్ళిపోయింది.

అప్పుడు కుముదినిగారి కిటికీ వైపు చూశాను. రోజూలాగే ఆవిడ అక్కడే నిలబడి ఉంది. కిటికీ ఊచల్ని పట్టుకుని తల ఊచల కానించి హరేరామ్‌ని దీక్షగా చూస్తోంది. ఆవిడ నన్ను చూడదు కాని, ఆవిడని నేను రోజూ చూస్తుంటాను. ఆవిడ మాట్లాడకుండా, బియ్యమో, పైసలో వాడికి ఇవ్వటానికి బదులు హరేరామ్‌ని అట్లాగ దీక్షగా చూడటం నాకు కుతూహలం కలిగిస్తుంది. మా బాల్కనీలోకి వాళ్ళ బెడ్‌రూమ్ కిటికీ కనిపిస్తుంది. ఒకే బిల్డింగులో ఉంటున్నాం. నాకు క్రింద ఇంటిలో ఉండే రమతో కాస్త చనువు ఉంది. కాని పక్క ఫ్లాట్‌లో ఉన్న కుముదినితో పరిచయం తప్ప స్నేహం కాలేదు.

దానికి ముఖ్య కారణం ఆవిడ చాలా బిజీగా ఉంటుంది. స్కూల్లో పని చేస్తుంది.

టీచరుగా కాదు. కమిటీకి సెక్రటరీ. తన శక్తినంతా ఆ స్కూలుకి ధారపోస్తున్నట్లు శ్రమిస్తుంది. టీచర్లు శ్రద్ధగా పాఠాలు చెప్తున్నారో లేదో, పిల్లలకి ఏ కార్యకలాపాలు కొత్తవి ప్రవేశపెట్టారో అని ఎప్పుడూ తాపత్రయ పడుతూ ఉంటుంది.

మా రాణి ఆవిడ స్కూల్లోనే చదువుతోంది కనక ఆవిడ ఎంత మంచిదో, ఎంత దీక్షకలదో నాకు తెలుసు. ఆవిడకి పిల్లలు లేరు. ఇంకా ఎన్నో సమితుల్లో ఆవిడ కమిటీ మెంబరు, సోషల్ వర్కర్.



కాని ఒక్కరోజు కూడా హరేరామ్‌కి ఆవిడ డబ్బులు కానీ, బియ్యం కానీ ఇవ్వలేదు. ఇవ్వగా నేను చూడలేదు.

కాని అతను రాగానే ఆ కేక విని కిటికీ దగ్గిరికి వస్తుంది.

అదే నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

రమ ఇంకో రకం మనిషి. రోజూ దేవుడికి పూజ చేస్తుంది. పిల్లల్ని ఎప్పుడూ కొట్టదు; విసుక్కోదు.

'రోజూ హరేరామ్‌కి అంత శ్రద్ధగా బియ్యం ఇస్తావు. అది కూడా పూజలో ఒక భాగమా? జాలా?' అనడిగాను ఒకరోజు.

'ఈ జన్మలన్నీ భగవత్ప్రసాదం. భగవంతుడి ఇచ్ఛ ఎట్లాగుంటే అట్లాగ జన్మిస్తాం. మన చేతిలో ఏముంది? అతడిని అట్లాగ పుట్టించాడు. నన్నిట్లాగ పుట్టించాడు. మనకి తినటానికీ, పెట్టడానికీ ఉంది. ఆకలి బాధ అందరికీ ఉన్నదే. ఏదో మనకి చేతనైంది చెయ్యటం—అంతే. ఇంతకంటె ఏం చెయ్యగలం! అందరి ఆకలి తీర్చలేం గదా!'' అంది.

అందరి ఆకలీ తీర్చగలరా ఎవరైనా!

ఎవరి ఆకలి వాళ్ళే తీర్చుకోగలిగి ఉండాలి.

చందాలు వేసుకుని అన్నదానాలు చేసినా ఏడాదికో, నెలకో ఒకరోజు ఓ వెయ్యిమందికి ఓ పూట ఆకలి తీర్చగలం. మిగతా వాళ్ళ సంగతి! మిగతా రోజుల్లో ఎవరైనా యాచనకు వస్తే నాకెన్నో ఆలోచనలు వస్తాయి. మనసు సంశయగ్రస్తమౌతుంది. ఇప్పుడు, అంటే పెద్దదాన్నై సంసారంలో పడ్డాక ఈ ప్రవర్తన కానీ చిన్నప్పుడు —

నిగనిగలాడుతూ నల్లగా మరుగుజ్జులాంటి ముష్టివాడొకడు వచ్చేవాడు. తలపాగా ఉండేది. చేతిలో కర్ర కింద కొడుతూ—

'సైసై చిన్నప్పారెడ్డి. నీ పేరే బంగారు కడ్డీ' అని పాడేవాడు.

ఆ అబ్బి రాగానే పిల్లలమంతా పరిగెత్తుకు వెళ్ళి పాట పాడించి ఆనందించే వాళ్ళం. వర్షాలు లేక తిండిలేదని, అందుకని మతం పుచ్చుకున్నానని కూతుర్ని కాన్వెంటులో పడేశానని చెప్పేవాడు. స్కూల్లో ఆ పిల్ల మరియమ్మ కోసం నా కళ్ళు వెతికేవి కానీ అతడి పోలికల్లో ఏ పిల్లా పరిచయం కాలేదు నాకు.

ఆ పాటా ఆ కబుర్లు విన్నాక దోసెడు నిండా బియ్యం తెచ్చిపెట్టేదాన్ని.

అప్పుడు మా ఇంట్లో డ్రమ్ము నిండా బియ్యం, గాదె నిండా ధాన్యం ఉండేవి.

వచ్చిన ప్రతి ముష్టివాడికీ దోసెడు నిండా బియ్యం పెట్టడం, దాహమని అడిగితే మంచి నీళ్ళు పొయ్యటం, పాతగుడ్డలు ఇవ్వటం కాలక్షేపంగా ఉండేది.

రాత్రి పడుకున్నాక, శిబి చక్రవర్తి, హరిశ్చంద్రుడూ వాళ్ళ కథలు చెప్పుకునేవాళ్ళం. వాళ్ళు చేసినటువంటి గొప్ప త్యాగాలు చెయ్యాలని కోరిక కలుగుతుండేది.

కానీ ఇప్పుడు ఆ తత్త్వం పూర్తిగా మారిపోయింది.

ఎవరైనా యాచనకి వస్తే ఇవ్వటమా మానటమా అని ముందుగా సందేహం వస్తుంది. కష్టపడి సంపాదించుకోకుండా ఈ అడుక్కోవటమేమిటి?

మనలో దాన గుణమే మనదేశంలో ముష్టివాళ్ళ సంఖ్యని అధికం చేసింది. బద్ధకస్తుల్ని పెంచుతోంది. యాచన కలవాటు పడిన వాళ్ళు విముఖులుగా తయారవుతున్నారు.

కష్టపడిన వాడికి తగిన ఫలితం దొరకాలి కానీ కష్టపడకుండా సుఖాన్ని మరగటం అలవాటు చెయ్యకూడదు.

మరి వికలాంగులూ రోగగ్రస్తులూ అయిన వాళ్ళ మాట?

నిరుద్యోగులూ, పని దొరకని వాళ్ళ సంగతి!

వాళ్ళ కోసమే ఈ దానాలు మొదలై ఉంటాయి. ఆ మార్గం కొందరు వృత్తిగా మార్చుకుంటున్నారు. అందుకే ఎవరికైనా ఊరికే ఇవ్వటం పట్ల నాకు అయిష్టం పెరిగింది.

'హరేరామ్‌కి రోజూ డబ్బులూ బియ్యం ఇచ్చే బదులు మీ గార్డెన్‌లో పని చేయించి నెలకింతని జీతం ఇవ్వరాదా?' అన్నాను రమతో.

రమ నవ్వి ఊరుకుంది. వాడు ముసలివాడే కానీ ఆ మాత్రం పని చెయ్యలేకపోడు. ఊరంతా ఇంటింటికీ ఎండలో వానలో తిరగటానికి మాత్రం ఓపిక వద్దూ!

ఆ మాటే రమతో అంటే—

'వాడికి జీతం ఇచ్చి పనికి పెట్టుకుంటే ఈ దయా జాలి ఉండవు. మన డబ్బులికి లెఖ్ఖగట్టి తగినంత పని రాబట్టుకోవాలని చూస్తాం' అంది.

ఆ మాటా నిజమే. తోట పని కూడా సక్రమంగా జరగాలి కదా. లేకపోతే శ్రమించి నాటిన చెట్లన్నీ పాడవుతాయి. దాని కోసం వాణ్ణి వేధించక తప్పదు.

మా ఇంటికి కూడా రకరకాల వాళ్ళు వస్తుంటారు.

ముఖ్యంగా అచ్చమ్మ చెప్పుకోవలసిన మనిషి.

బలం ఉన్నన్నాళ్ళు పాచిపనులు, కూలిపనులూ చేసిందిట. ఇప్పుడు నడుం వంగిపోయింది. తెగిపోయిన చెప్పులు గుడ్డపీలికలతో ముడి వేసి తొడుక్కుంటుంది. వంగిపోయిన కాళ్ళతో నడుస్తుంది. కొడుకులున్నారట కానీ వాళ్ళ మీద ఆధారపడదు. వాళ్ళింట్లో ఉంటుంది అంతే! తన తిండికి సరిపోయే డబ్బులు రోజూ తనే సంపాదించుకుంటుంది. గడ్డి కోస్తుంది. పిండి దంచుతుంది. ఆవాలు, కారం దంచుతుంది ఊరగాయల రోజుల్లో.

పిసికిన మట్టిలా వేలాడుతున్న జబ్బని చూపించి 'నేను పని చెయ్యలేననుకుంటున్నావు కదూ. నా బలం నీకేం తెలుసు! అర గంటలో రెండు శేర్ల బియ్యం దంచిపడేస్తాను. ఆవాలింకా తెప్పించలేదా, మంచికాయ వస్తోంది బజార్లోకి' అంటుంది.

ఊరికే డబ్బులిస్తే తీసుకోదు. 'నేను ముష్టికి రాలేదు. పని చేయించుకో, డబ్బులియ్యి' అని గుమ్మంలో కూర్చుంటుంది,

ఇటువంటి వాళ్ళున్నారా అని ఆశ్చర్యపోతుంటాను నేను. దాని విగ్రహం చేయించి నాలుగు రోడ్ల కూడలిలో పెట్టించాలనిపిస్తుంది నాకు.

ఇది వరకు ఆఫీసులో ప్యూన్‌గా ఉండి రిటైరయ్యాడు రాములు.

కూతురు చదువుకుంటోంది సాయం చెయ్యమని అడిగాడు.

నెలకి ఒకసారి వచ్చి మాట్లాడకుండా ఇచ్చింది పుచ్చుకుని నమస్కారం పెట్టి వెళ్ళిపోతాడు. అతడిని చూస్తే సాయం చెయ్యాలనిపిస్తుంది. సానుభూతి కలుగుతుంది.

ఇంక కనకమ్మగారు వస్తుంటుంది అప్పుడప్పుడు. ఆవిడ మా ఇంట్లో కొన్నాళ్ళు వంట చేసింది.... మా పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు. ఆవిడ వస్తోందని పిల్లలెవరైనా చెప్పగానే నాకు గాబరా, దిగులూ వచ్చేస్తాయి. ఇంట్లో లేనని చెప్పించుదా మనిపిస్తుంది. కానీ అబద్ధాలు అలవాటు లేదు. ఇంత మాత్రానికే తట్టుకోలేకపోతే ఎట్లాగ అని నన్ను నేనే సముదాయించుకుంటాను. వస్తూనే అడుగుతుంది—

'పండగకి ఏం చీర కొన్నారు? ఇప్పుడంతా షిఫాన్‌లే కడుతున్నారు. సీతాదేవిగారు కూడా అదే కొన్నారు. దేవుడు చేసిన పెళ్ళి చూశారా? చూసి తీరాలి. ఆక్టింగు అంటే శారదదే. ఏడిచేడిచి నా కళ్ళు వాచిపోయాయి. అబ్బాయి స్కూలుకి వెళుతున్నాడా? మా అబ్బాయి కూడా ఇట్లాంటి చొక్కాయే కుట్టించమంటున్నాడు. ఏమిటో రాజేష్‌ఖన్నా స్టైయిలుట. ఇదే ఫాషన్‌ట: ఈ స్టీలు గిన్నె నేనుండగా కొనలేదే.... గుడ్డలిచ్చి కొన్నారా? డబ్బులిచ్చి కొన్నారా?' అంటూ ప్రశ్నలు వేస్తుంది.

'సోఫా అటూ, బీరువా ఇటూ ఎందుకు మార్చారూ! ఇది వరకే బాగుంది' అని విమర్శిస్తుంది.

నేను మామూలుగా ఇచ్చే స్వయంపాకం, ఒక రూపాయీ ఇస్తే తీసుకుని 'కాస్త కాఫీ పొడిస్తావా? పాత చీర కూడా ఒకటి చూసి పడెయ్యి' అంటుంది.

వెళుతూ వెళుతూ వెనక్కి తిరిగి 'పాత చెప్పులున్నాయా?' అంటుంది. మళ్ళీ తను వచ్చేటప్పటికి సిద్ధంగా ఉంచమంటుంది.

ఆవిడ వెళ్ళాక తలుపు వేశాక, ఆవిడ వెళ్ళిందని నమ్మకం కలిగాక విశ్రాంతిగా ఒక నిట్టూర్పు విడుస్తాను.

ఇంటి పనంతా చేస్తుంది చంద్ర. దానికి చుట్టుపక్కల అందరి కంటే ఎక్కువ జీతమే ఇస్తాను. పాత చీరలిస్తాను. ధరలు పెరుగుతుంటే దాని జీతం రెండు రూపాయలు పెంచుతుంటాను. కష్టానికి తగ్గ ఫలితం ఉండటం న్యాయం. చాలా మంది తక్కువ జీతం ఇచ్చి ఎక్కువ పన్లు చేయించుకుంటారు. అది నాకు ఇష్టం ఉండదు. మనుషుల్ని బానిసల్లాగ వాడుకోకూడదు. మనం పూర్తిగా వాళ్ళమీద ఆధారపడనూ రాదు. అది కూడా నాకు అసహ్యమే.

మా చిన్నతనంలో తాగిన కాఫీ గ్లాసు పని మనిషి వచ్చి తీసికెళ్ళాల్సిందే. ఇప్పుడు నా ప్రతి పనీ ఇంకో మనిషి చెయ్యటమన్నది నాకు పరాధీనత అనిపిస్తుంది. అందుకే పిల్లలు పెద్దవాళ్ళయ్యాక తాహతు ఉన్నా నేను వంటమనిషిని మాన్పించాను. మాకు ఆడపిల్ల ఒక్కతే అయినా పనుల విషయంలో మాత్రం ముద్దు సాగదు రాణికి. చదువు సంగీతంతోపాటు వంట, కుట్టూ కూడా నేర్పాను. వంట మనిషి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు. నేను పని చేస్తుంటే రాణీ నాకు సాయంగా ఉంటూ అన్నీ నేర్చుకుంది. హరే రామ్ గురించి చెప్తూ చాలా దూరం వెళ్ళిపోయాను.

అసలు నేను చెప్పాలనుకున్న విషయం — చిన్నతనంలో నా లేతమనసులో ఉండిన అవ్యాజమైన దానగుణం పోయి ప్రయోజన దృష్టి ఏర్పడింది. ఇప్పుడు కష్టానికి తగ్గ ఫలితం ఉండాలనే సిద్ధాంతం నా ప్రయత్నాలలో కనిపిస్తూ ఉంటుంది

శ్రమించే వాడిదే కావాలి భూమి! అంటేనూ ఇదే అర్థం కదా.

ప్రవాహంలో ఒత్తిడిని ప్రతి కణమూ అనుభవిస్తుంది. ఈ మార్పుకి కారణం సాంఘిక చైతన్యమూ కావచ్చు, ధరల పెరుగుదల వంటి ఆర్థికపు ఒత్తిడీ కావచ్చు.

మనిషి అవసరాలు పెరిగిపోయి కూడా దానగుణం తరిగిపోయింది. మొత్తానికి నేను కూడా హరే రామ్‌కి ముష్టి వెయ్యను.

పైనుంచి క్రిందికి దిగి వెళ్లాలి!

వెయ్యటం అవసరమా అని ఆలోచిస్తుంటాను.

కానీ కుముదిని సోషల్ వర్కరే కదా, అతడికి ఎందుకు సాయం చెయ్యదూ అని నాకు కుతూహలం.

'ముష్టివాళ్ళని పోషించి ప్రోత్సహించకూడదు' అనేది ఆవిడ సిద్ధాంతమేమో అనుకునేదాన్ని. ఐనా నా కుతూహలం తీరలేదు.


హరే రామ్ వెళ్ళిపోయాడు.

కుముదిని కూడా కిటికీ దగ్గర నుంచి కదలింది.

*

మర్నాడు హరేరామ్ వచ్చాడు.


కానీ రోజూలాగ లేదు ఆ పిలుపు.



ఆధునిక జీవితంలో 'గాస్ స్టవ్'ల వాడకం ఎక్కువగానే వున్నది. దాదాపు మధ్య తరగతి కుటుంబాలవారంతా వంటకు 'గాస్'నే ఉపయోగిస్తున్నారు. అయితే, ఈ స్టవ్‌ను ఎలా వాడాలి? ఎలా పరిశుభ్రంగా వుంచుకోవాలి? అన్నవి తెలుసుకోడం అవసరం.

కొందరేం చేస్తారంటే - స్టవ్‌ను వెలిగించకుండానే గాస్‌ను తిప్పేసి, వదిలిపెట్టేస్తూ వుంటారు. దానివల్ల గాస్, బయట వ్యాపించి, ఆ పరిసరాల్లో మంటలాంటిది ఏది వున్నా, అంటుకుని పేలే ప్రమాదం వుంది. అంచేత అవసరం తీరిపోయిన వెంటనే, గాస్ సిలెండర్‌ను విధిగా మూసెయ్యాలి.

గాస్ స్టవ్‌ను రోజూ సబ్బు నీళ్ళలో ముంచిన గుడ్డతో తుడవడం అవసరం. బర్నర్‌ను వారానికి ఒకసారి బ్రష్‌తో శుభ్రం చేస్తూ వుండాలి. బర్నర్ మధ్య వున్న చిన్న చిన్న రంధ్రాలలో సన్నని ఇనప వూచతో పొడిస్తే, వాటిల్లో పేరుకున్న దుమ్ము, మసి వచ్చేస్తుంది. అలా శుభ్రం చెయ్యడం వల్ల గాస్ వృధా కాదు; పైగా మంట కూడా బాగుంటుంది. అప్పుడప్పుడు బర్నర్‌ను కిరసనాయిలుతో కడుగుతూ వుంటే, బర్నర్ తుప్పుపట్టకుండా వుంటుంది. మంట మండుతున్నప్పుడు, సిలెండర్‌ను అటూ ఇటూ కదపడం, జరపడం వంటివి కూడా ఎన్నడూ చెయ్యకూడదు. సిలెండర్ నుంచి స్టవ్‌కు వచ్చే రబ్బర్ గొట్టానికి చిన్న చిన్న రంధ్రాలు పడే అవకాశం వుంది. అలా రంధ్రాలు పడితే, గాస్ వృధా కావడం, ప్రమాదం వాటిల్లడం కూడా జరగవచ్చు. అలాంటి అనుమానం వున్నప్పుడు ఆ రబ్బరు గొట్టాన్ని వెంటనే మార్పించాలి. వీలైనప్పుడు, ఆ గొట్టాన్ని కూడా సబ్బునీళ్ళతో కడిగి, ఎండబెట్టి తిరిగి జాగర్తగా బిగించెయ్యొచ్చు. సిలెండరుతో ఎలాంటి ఇబ్బంది వచ్చినా, మనం మాత్రం ఏమీ కలగజేసుకోకూడదు. ఎలాంటి అనుమానం కలిగినా, వెంటనే దానికి సంబంధించిన మెకానిక్‌ని పిలిపించి, సరిచేయించడమే ఉత్తమం.



'హరే రామ్, హరే రామ్! జ్వరం వచ్చింది తల్లో. నిలబడలేకపోతున్నాను. ప్రాణం పోతూంది తల్లో! కాస్త టీనీళ్ళు పోస్తారా!' అన్నాడు.

ఖంగుమని మోగటం లేదా గొంతు. నీరసంగా వణుకుతోంది.

బాల్కనీలోకి వచ్చాను.

ఇంకా రమ రాలేదు. నేను టీ ఇవ్వనా! ఎట్లాగూ రమ ఇస్తుంది. నేను ఇవ్వటమెందుకు? పోటీగా వుంటుందేమో – ఆలోచిస్తున్నాను.

ఆకలి, ప్రాణం మాత్రమే మిగిలిన మనిషిగా కనిపిస్తున్నాడు హరేరామ్.

మనిషి కనీసపు దశ ఇది. మనిషికి అర్థం ఉనికే.

హరేరామ్‌కి ఎవరైనా ఉన్నారా?

ఉంటే ఈ అవస్థలో ఎందుకిట్లా వస్తాడు?

ఉన్నా, డబ్బు లేకపోతే వాళ్ళు మాత్రం ఏం చేస్తారు?

జ్వరంతో ఆకలితో ప్రాణం పోతుంటే చూస్తూ ఊరుకుంటారా!

డబ్బు లేకపోతే ఊరుకుంటారు.

నేను వూరుకోవటం లేదూ! అన్నీ వున్నా సాయం చెయ్యగలిగానా?

రమ ఒక తల్లి వాడికి. నిజంగా రమ గొప్పది; కుముదిని కంటే గొప్పది.

గుర్తు వచ్చినట్లు కుముదిని గది వైపు చూశాను. కుముదిని అక్కడే వుంది. కిటికీ ఊచలు పట్టుకుని హరేరామ్‌ని చూస్తోంది. ఇంతలోనే రమ వచ్చింది. బియ్యం, డబ్బులూ ఇచ్చింది హరేరామ్‌కి.

'టీ చేస్తున్నాను కూచో,'. అంది.

ఇంక ఫరవాలేదు అనుకున్నాను. రమ లోపలికి వెళ్ళింది టీ తేవటానికి. మళ్ళీ కుముదిని గది వైపుచూశాను. అక్కడే ఉంది కుముదిని ఇంకా.

అనుకోకుండా మాచూపులు కలుసుకున్నాయి. ఒకరికొకరు పట్టుబడినట్లుంది. మా మధ్య ఒక తెర తొలగినట్లనిపించింది నాకు.

కుముదిని సన్నగా నవ్వింది. నేనూ నవ్వాననుకుంటాను. అలాగే నిలబడ్డాం కొంతసేపు.

రమ 'చా'తో బాటు రెండు రొట్టెలు కూడా తెచ్చి ఇచ్చింది హరేరామ్‌కి.

గబగబా తింటున్నాడు. జ్వరంలో అంత ఆకలి వుంటుందా?

ఏదో టాబ్‌లెట్ కూడా ఇచ్చింది రమ. మందు వేసుకుని టీ తాగి అక్కడే పడుకున్నాడు. జ్వరానికి కాలోలు వణుకుతున్నాడు.

బీరువాలోంచి గట్టిగా ఉన్న పాత పంచ ఒకటి తీసి, క్రిందికి వెళ్ళి 'కప్పుకో'మని హరేరామ్‌కి ఇచ్చాను.

ఇస్తూ పైకి చూశాను. కుముదిని అక్కడే ఉంది.

*

సాయంత్రం కాలింగ్ బెల్ విని తలుపు తీశాను. కుముదిని లోపలికి వచ్చింది. చేతిలో ఏదో ఆహ్వాన పత్రిక ఉంది. ఇద్దరం డ్రాయింగు రూములో కూర్చున్నాం. కుముదిని ఏదో విషయాన్ని, నాతో సన్నిహితంగా చెప్పటానికి ప్రయత్నిస్తున్నట్లు ఆ చూపులు వాల్చుకోవటం, సన్నగా నవ్వటం, మాట్లాడుతూ పరధ్యానంగా ఆగిపోవటం, సూచిస్తున్నాయి. ఆవిడ చేతిలో ఉన్న కవరునే చూస్తున్నాను.

'మేము బెగ్గర్ హోమ్ ఒకటి స్థాపిస్తున్నాం ప్రారంభోత్సవం వచ్చే శుక్రవారం జరుగుతుంది. చందాలు వసూలు చేస్తున్నాం. మీకు ఇవ్వాలనిపిస్తే ఐదు రూపాయలు దానం చెయ్యండి. ప్రారంభోత్సవానికి మీ దంపతులు రావాలి. మాకు మీ చేయూత నివ్వాలి. ఈ విషయంలో మీ సలహాలు కూడా స్వీకరిస్తాం. ప్రారంభోత్సవానికి వచ్చి మా ప్రయత్నాన్ని ఆశీర్వదించండి' అంది కవరు అందిస్తూ.

'తప్పకుండా వస్తాను' అన్నాను సంభ్రమంగా.

కుముదిని నా వైపు చూసి మెల్లగా అంది, 'ఈవిడ పెద్ద సోషల్ వర్కర్‌నని చెప్పుకుంటుంది, కారుల్లో తిరుగుతుంది కానీ ఒక ముష్టివాడు ప్రాణం పోతుంటే చూస్తూ ఊరుకుంది అనుకుంటున్నారు కదూ సుగుణా! ఈ హరేరామ్‌ని నేనూ రోజూ చూస్తుంటాను. అతడు నా హృదయంలో జ్వలితమౌతున్న ఒక గొప్ప ఆశయానికి సజీవ సంకేతం. నా ఆశయాన్ని గురించి నన్ను క్షణక్షణం హెచ్చరించే ఒక నిరంతర స్మృతి చిహ్నం హరేరామ్ ఒక్కడే! కానీ ఇతడు వేల కొలది అన్నార్తులకి, బాధాపీడితులకి ప్రతినిధి. హరేరామ్ ఆకలి రమ తీరుస్తుంది. వాళ్ళందరి ఆకలి ఎవరు తీరుస్తారు? తీర్చగలరు? ఒక్కొక్క గృహిణి ఒక అనాధని పోషించగలదా? అది మనస్తత్వ రీత్యా, ఆర్థిక అశక్తి కారణంగా అసంభవం! దిక్కులేని పిల్లలు, శక్తి లేనివారు, రోగగ్రస్తులు, ముసలివాళ్ళు అయిన అనాధల కోసం ఒక ఆశ్రమం స్థాపించాలని నా చిరకాల వాంఛ. ఆ ఆశయం ఇప్పటికి నెరవేరుతోంది. హరేరామ్‌కి ముష్టి వెయ్యగలను, తిండి పెట్టగలను. కానీ దానితో నా మనసు తృప్తి పడిపోతుంది. ఈ అన్నార్తుడు నాలో రగిలించే ఆశయ జ్వాల చల్లారిపోతుంది. నా ప్రణాళిక నిరాధారమై కూలిపోతుంది. అందుకనే, అందుకనే నేను ఎప్పుడూ హరేరామ్‌కి బియ్యం కూడా వెయ్యలేదు' అంది వెళ్ళడానికి లేస్తూ.

ఆవిడ చిరునవ్వు కాంతిలో ఒక కన్నీటి పొర మెరిసింది.

కుముదిని గురించి నా సందేహం తీరింది. కుముదిని చాలా గొప్పది అనుకున్నాను.

*

'దీన బంధు' ఆశ్రమం ప్రారంభోత్సవానికి వెళ్ళాను.

ఏర్పాట్లు, సదుపాయాలూ చాలా బాగున్నాయి.

వంట గది, భోజనశాల, పడక గదులు, స్నానాల గదులు, చుట్టూ పెద్ద ఆవరణ ఉన్నాయి. వైద్య సదుపాయం ఉంది. కొన్ని గదులు చేతి పనులకి కేటాయించారు. ఒక గదిలో ట్రాన్సిస్టరూ, లైబ్రరీ ఉన్నాయి.

నిన్నటి దాకా అడుక్కుతిందామన్నా దొరకని వాళ్ళకి ఇవాళ ఎన్ని సదుపాయాలు దొరుకుతున్నాయి! ముష్టివాడి మెళ్ళో ఏనుగు పూలమాల వేసినట్లు!

ఈ ఆశ్రమం నిర్వహణ ఎట్లా సాగుతుందో.... అంటే చందాలు సద్వినియోగమవటం, ఈ దీనులు సంస్కరింపబడటం ఎంత వరకూ జరుగుతాయో కానీ 'మనుషుల తలచుకుంటే జాతకాలు కూడా మారిపోతాయి' అనిపించింది.

ఆ మరునాడు హరేరామ్ రాలేదు. ఆశ్రమంలో చేరాడేమో అనుకున్నాను.

తరువాత రమ వచ్చి చెప్పింది: 'హరేరామ్‌కి జ్వరం ఎక్కువై నిన్ననే........ఈ లోకం వదిలేశాడు.'

*